ప్రజాశక్తి
సోమవారం 20 మే 2024 5
శ్రీ సత్యసాయి

తాడిపత్రిలో కొనసాగిన సిట్ దర్యాప్తు

తాడిపత్రిలో టిడిపి, వైసిపి గ్రూపులు రాళ్లు రువ్వుకున్న ప్రాంతాన్ని పరిశీలిస్తున్న సిట్ అధికారులుం

తాడిపత్రి రూరల్: సార్వత్రిక ఎన్నికల సందర్భంగా తాడిపత్రిలో చోటు చేసుకున్న హింసాత్మక ఘటనలు, పోలీసుల వైఫల్యంపై దర్యాప్తు చేసేందుకు ఏర్పాటైన స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీం(సిట్) శనివారం రాత్రి తాడిపత్రికి చేరుకుంది. సిట్ డీఎస్పీ శ్రీనివాసులు, ఏసీబీ డీఎస్పీ భూషణం, ఏసీబీ ఇన్‌స్పెక్టర్ జిఎల్.శ్రీనివాస్‌లు శనివారం రాత్రి నుంచి ఆదివారం సాయంత్రం వరకు దర్యాప్తును కొనసాగించారు. ఓంశాంతినగర్, పాతకోట, గానుగవీధిలో పర్యటించి, స్థానికులతో మాట్లాడారు. ఎమ్మెల్యే, మున్సిపల్ ఛైర్మన్ ఇళ్ల పరిసర ప్రాంతాలనూ పరిశీలించారు. ఇరువర్గాలు గొడవపడ్డ కళాశాల మైదానంలో కలియతిరిగారు. ఆదివారం ఉదయం పట్టణ, రూరల్ పోలీస్‌స్టేషన్లలో పలు రికార్డులను పరిశీలించారు.

వార్త మెయిన్‌లో

రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమల్లో ఉంది. అక్రమాల నియంత్రణకు అధికారులకు సర్వహక్కులూ ఉన్నాయి. అధికార, ప్రతిపక్ష పార్టీ నాయకులందరినీ అధికారులు ఒకేలా చూడాల్సి ఉంది. హిందూపురంలో మాత్రం అధికార పార్టీ నేతలకు అధికారులు సలాం కొడుతున్నారు. దీనికి నిదర్శనం గత కొంత కాలంగా హిందూపురం పట్టణ సమీపంలోని పెన్నా నదిలో పదుల సంఖ్యలో ట్రాక్టర్లను పెట్టి పగలూ రాత్రి అన్న తేడా లేకుండా ఇసుకను తరలిస్తున్నారు. ఇది పెద్ద ఎత్తున ఇసుక తరలిపోతున్నా ఇటు సెబ్ అధికారులు అటు రెవెన్యూ అధికారులు ఏ ఒక్కరూ కూడా వీరిపై చర్యలు తీసుకోకపోవడమే దీనికి నిదర్శనం. ఎవరూ పట్టించుకోకపోవడంతో పెన్నాలో ఇసుక లూటీ

ఎవరూ... పట్టించుకోలేద(పె)న్నా..!

- పక్కాగా పెన్నా లూటీ..!
- 'ప్రతిమ' పేరుతో ఇసుక తరలింపు
- జిల్లా అధికారులు పర్యటిస్తున్నా పట్టించుకోని పరిస్థితి
- శాఖల మధ్య సమన్వయలోపం

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం పట్టణంలో ఉన్న పెన్నా నది పరివాహక ప్రాంతంలో ప్రతిమ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్ పేరుతో బిల్లులు సష్టించి అధికార పార్టీకి చెందిన హిందూపురం రూరల్ మండలం ఓ ప్రజాప్రతినిధి, సోదరుడి కుమారుడు, సోదరులు, అధికార పార్టీకి చెందిన మరి కొంతమంది కలిసి పదుల సంఖ్యలో ట్రాక్టర్లను పెట్టుకుని పెన్నా నదిలో ఇసుకను తోడేస్తున్నారు. పగలు పట్టణం, రాత్రి సమయాల్లో కర్నాటకకు తరలిస్తూ లక్షలాది రూపాయలు సొమ్ము చేసుకుంటున్నారు. సంపాదిస్తున్నారు. ప్రజాశక్తి క్షేత్ర పరిశీలనకు వెళ్లి నదిలో ఇసుక తోడుతున్న వారితో అనుమతులు ఉన్నాయా అని అడిగితే విజయవాడకు చెందిన ప్రతిమ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్ వారు అందించిన బిల్లును చూపించారు. ఆ బిల్లు రూ.2500 చెల్లించినట్లు ఉంది. ఉదయం 7:30 గంటల నుంచి కొంత మందికి, మధ్యాహ్నం 1.40 వరకు మరి కొంత మందికి సాయంత్రం 5:30 వరకు పెన్నా నది నుంచి ఇసుకను తరలించడానికి అనుమతులు ఇచ్చినట్లు ఉంది. ఈ బిల్లు ఒక లోడ్‌కు ఇచ్చారా...? ఒకరోజు మొత్తానికి ఇచ్చారా....? అన్న దానిపై స్పష్టత లేదు. ఇసుక రీచ్ నిబంధనల మేరకు రీచ్‌ల వద్ద సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలి, జెసిలతో క్యూబిక్ మీటర్ లేదా ఇన్ని టన్నులు ఇస్తున్నట్లు నమోదు చేసి దూరాన్ని బట్టి బిల్లులో సమయం వేసి ప్రతి లోడ్ కు బిల్లు ఇస్తారు. అలా కాకుండా పెన్నా నది పరివాహక ఇసుక రీచ్‌లో రోజు మొత్తానికి ఒకే బిల్లుతో ఇసుక రవాణా జరుగుతుంది. ఇసుకను నింపుతున్న వారిని బిల్లు ఎక్కడ ఇస్తారని అడిగితే వారు దీనిపై సమాధానం ఇవ్వడం లేదు. ఈ ఇసుక తరలింపు వెనుక అధికార పార్టీకి చెందిన ముఖ్య నేత సోదరుడు ఉన్నట్లు తెలుస్తోంది. అక్రమ ఇసుక రవాణాను అధికార పార్టీ నేతల కనుసనల్లో జరుగుతుండడంతో అధికారులు చర్యలు తీసుకోకుండా ఉదాసీనంగా వ్యవహరిస్తున్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

పెన్నా నది నుంచి ట్రాక్టర్లలో తరలిపోతున్న ఇసుక (ఇన్‌సెట్‌లో ప్రతిమ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ పేరుతో ఇచ్చిన బిల్లు)

శాఖల మధ్య సమన్వయలోపం

ఇసుక అక్రమ తరలింపుపై ఆయా శాఖల మధ్య సమన్వయ లోపం కన్పిస్తోంది. ఒకరిపై ఒకరు నెపం నెట్టేసుకునేలా వ్యవహరిస్తున్నారు. ఇసుక తరలింపుపై తమకు ఏమీ తెలియదని, రీచ్ లకు సంబంధించి కార్యాలయం నుంచి ఎటువంటి ప్రత్యుత్తరాలు జరపలేదని, ఈ విషయాలను మైన్స్ అధికారులు చూస్తున్నారంటూ హిందూపురం తహశీల్దార్ శివప్రసాద్‌రెడ్డి తెలియజేశారు. ఈ విషయంపై సెబ్ అధికారులకు వివరణ కోసం ప్రయత్నించగా స్థానిక సెబ్ సిఐ మూడు రోజులుగా అందుబాటులోకి రాలేదు. పోలీసులు అయితే అడపాదడపా ఒకటి రెండు ట్రాక్టర్లను అలా పట్టుకుని ఇలా వదిలి వేస్తున్నారన్నా విమర్శలు పెద్ద ఎత్తున వినిపిస్తున్నాయి. ఎటువంటి అనుమతులు పొందకుండానే బిల్లును సృష్టించి ప్రతిమ పేరుతో ఇసుకను అధికార పార్టీకి చెందిన నాయకులు లూటీ చేస్తున్నారనది మాత్రం స్పష్టంగా తెలుస్తోంది. పెన్నా నదిలో ఇసుకను ఎడాపెడా లూటీ చేస్తుండడంతో చుట్టుపక్కన ఉన్న రైతన్నలు లబోదిబోమంటున్నారు. ఎవరికి ఫిర్యాదు చేసిన ఏ ఒక్కరు కూడా వారిపై చర్యలు తీసుకోవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు అక్రమ ఇసుక రవాణాపై ప్రత్యేక దష్టి సారించి దానిని నియంత్రించే దిశగా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

అధికారుల్లో గుబులు

- తప్పు చేస్తే దండన తప్పదు
- ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైనప్పటి నుంచి ఇదే తీరు



ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఎన్నికల ప్రక్రియలో ఏ మాత్రం తప్పు చేసినా అధికారులపై వేటు పడుతోంది. ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైనప్పటి నుంచి ఒకరి తరువాత ఒకరిపై వేటు పడుతూనే ఉంది. ఓటర్ల జాబితా తయారీ మొదలు ఓటింగ్ పూర్తయ్యే వరకు అధికారులపై వేటు పడిన ఘటనలు అనేకం చోటు చేసుకున్నాయి. ఓటర్ల జాబితాలో తప్పులు చేసారన్న దానిపై ఇది వరకే ఇద్దరు జిల్లా అధికారులపై వేటు పడింది. ఉరవకొండ నియోజకవర్గం పరిధిలో ఓటర్లను దురుద్ధేశంతో తొలగించారన్న ఆరోపణలపై అధికార వైసిపి, ప్రతిపక్ష టడిపిలు పరస్పరం ఆరోపణలు చేసుకోవడమే కాకుండా ఎన్నికల సంఘానికి ఫిర్యాదులు అందజేశారు. దీనిపై విచారణ చేపట్టిన ఎన్నికల సంఘం ఇద్దరు జిల్లా ఉన్నతాధికారులపై వేటు వేసింది. జిల్లా పరిషత్ సిఇఒలు స్వరూప రాణి, భాస్కర్‌రెడ్డిలపై వేటు వేశారు. వీరే కాకుండా విఆర్‌ఎలపైనా వేటుపడింది. ఈ క్రమంలోనే ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైన తరువాత అధికార పార్టీకి అనుకూలంగా ఉన్నారన్న ఫిర్యాదులపై జిల్లా కలెక్టర్ గౌతమి, ఎస్పీ అన్బురాజన్‌లపైనా బదిలీ వేటు పడింది. ఇక కొత్త అధికారులు కాబట్టి సజావుగా ఎన్నికలు సాగుతాయని అనుకున్నారు. ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ మొదలయ్యాక డీఎస్పీ రాఘవరెడ్డిని బాధ్యతల నుంచి తప్పించారు. తాడిపత్రిలో మూడు రోజులపాటు ఎన్నికల సమయంలో ఘర్షణ చోటు చేసుకోవడంతో ఏకంగా జిల్లా ఎస్పీ అమిత్ బర్దర్ బదిలీకావల్సి వచ్చింది. డిఐజి అమ్మిరెడ్డి సైతం బదిలీ అయ్యారు. ఆయన్ను సస్పెండ్ చేయడమే కాకుండా విచారణకు ప్రత్యేక బృందాన్ని నియమించారు. ఈయనతోపాటు తాడిపత్రి డీఎస్పీ గంగయ్య, సిఐ మరళీకృష్ణపైనా వేటు పడింది. ఈ వేటు ఇంకా మరికొంత మంది కింది స్థాయి అధికారులపైనా వేటు పడే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ప్రత్యేక విచారణ బృందం రెండు రోజులుగా తాడిపత్రిలో మకాం వేసి పూర్తి స్థాయి విచారణను చేపట్టింది. ఈ విచారణ నివేదిక ఆధారంగా కేసులు కూడా ఉండే అవకాశాలున్నట్టు తెలుస్తోంది. ఇలా ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైనప్పటి నుంచి ఒకరి తరువాత ఒకరిపై వేటు పడుతూనే వస్తోంది. ఎన్నికల ప్రక్రియ ఇంకా తుది ఘట్టం ఉండనే ఉంది. ఓట్ల లెక్కింపు జరగాల్సి ఉంది. అది వచ్చాక జిల్లాలో చోటు చేసుకునే పరిణామాలు ఉండనున్నాయి. వీటన్నింటి నేపథ్యంలో అధికారుల్లో గుబులు నెలకొంది. ఎక్కడ ఏ తప్పు జరిగితే చర్యలుంటాయోనని భయపడిపోతున్నారు. ఇప్పుడు జిల్లా కలెక్టర్ మొదలు డిఐజి, ఎస్పీ అంతా కొత్తవారే వచ్చారు. ఎన్నికల ఫలితాల అనంతరం పరిణామాలను ఈ కొత్త అధికార యంత్రాంగం ఏ రకంగా వ్యవహరించనుందన్నది చూడాల్సి ఉంది. ఏ మాత్రం చిన్న తప్పు జరిగినా ఇబ్బందులు పడుతామని ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే జిల్లాలో పది మంది అధికారులు ఈ రకమైన ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. నువ్వా..నేనా అన్నట్టుగా సాగిన ఈ ఎన్నికల్లో అధికార, ప్రతిపక్ష పార్టీల నేతలు ఉన్నారు. ఈ పోరులో నలుగుతున్నది మాత్రం అధికారులే. మొత్తం మీద అడకత్తెరలో పోకచెక్కలాగా తయారయ్యింది వీరి పరిస్థితి.

కౌంటింగ్‌ను ప్రశాంతంగా నిర్వహిస్తాం

బాధ్యతల స్వీకరణ సందర్భంగా పోలీసు గౌరవవందనం స్వీకరిస్తున్న ఎస్పీ గౌతమిశాలి

- శాంతిభద్రతల పరిరక్షణకు చర్యలు
- అనంత ఎస్పీ గౌతమి శాలి
- జిల్లా పోలీసు కార్యాలయంలో బాధ్యతల స్వీకరణ

అనంతపురం జిల్లా ఎస్పీగా బాధ్యతలు స్వీకరిస్తున్న గౌతమి శాలి

ప్రజాశక్తి -అనంతపురం క్రైం

అనంతపురం జిల్లాలో సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి కౌంటింగ్‌ను ఎలాంటి శాంతిభద్రతల సమస్య రానీయకుండా ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని చర్యలూ తీసుకుంటామని జిల్లా నూతన ఎస్పీ గౌతమిశాలి తెలియజేశారు. ఎస్పీగా ఆమె ఆదివారం ఆమె జిల్లా పోలీసు కార్యాలయంలోని ఎస్పీ ఛాంబర్లో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఎస్పీ కాన్ఫరెన్స్ హాలులో మీడియాతో మాట్లాడారు. జిల్లాలో ప్రశాంతత లోపించకుండా శాంతిభద్రతలను పరిరక్షించడానికి కార్యాచరణ ప్రణాళికలతో ముందుకెళ్తామన్నారు. అన్నివర్గాల ప్రజల సహకారం తీసుకుంటామన్నారు. క్షేత్రస్థాయి అధికారులు, సిబ్బందితో మాట్లాడి మెరుగైన పోలీసింగ్‌కు కషి చేస్తామన్నారు. సెన్సిటివ్ గ్రామాలు, బైండోవర్లు... ఇలా ఏదైనా చట్టపరంగా ముందుకెళ్తామన్నారు. ఎన్నికల నియమ నిబంధనల మేరకు స్ట్రాంగ్ రూంల వద్ద పటిష్టంగా మూడంచెల భద్రత కొనసాగుతోందన్నారు. కౌంటింగ్ ప్రక్రియ సందర్భంగా ఎలాంటి హింస, అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా చర్యలు తీసుకుంటామన్నారు.

మూడంచెల భద్రతను మరింత బలోపేతం చేయండి

పోల్డ్ ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్ రూంలను ఎస్పీ గౌతమిశాలి పరిశీలించారు. కేరళ సాయుధ స్పెషల్ పోలీసులు, ఏఆర్ సాయుధ పోలీసులు, సివిల్ పోలీసులు మూడంచెల భద్రత నిర్వహిస్తుండటాన్ని సమీక్షించి మరింత బలోపేతం చేయాలన్నారు. పార్కింగ్ స్థలాన్ని స్ట్రాంగ్ రూంలకు దూరంగా ఏర్పాటు చేయాలన్నారు. అన్ని గేట్లలోను సిబ్బందిని బందోబస్తుకు నియమించాలని సూచించారు. అవాంఛనీయ ఘటనలు, హింసకు తావులేకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లా ఎస్పీతో పాటు అదనపు ఎస్పీలు ఆర్.విజయభాస్కర్ రెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి (ఏఆర్), అనంతపురం డీఎస్పీ టివివి.ప్రతాప్, ఎఆర్ డీఎస్పీ మునిరాజ, సిఐలు జాకీర్ హుస్సేన్, ఇందిర, రెడ్డెప్ప, ప్రతాప్ రెడ్డి తదితరులు ఉన్నారు.

సోమందేపల్లి మండల కేంద్రంలోని సిపిఎం కార్యాలయంలో సుందరయ్య చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న సిపిఎం నాయకులు

సుందరయ్య పోరాట స్ఫూర్తిని కొనసాగిద్దాం

వర్ధంతి సందర్భంగా జిల్లా వ్యాప్తంగా ఘన నివాళి

ప్రజా సంక్షేమం కోసం నిరంతరం శ్రమించిన పుచ్చలపల్లి సుందరయ్య పోరాట స్ఫూర్తి అనుసరణీయమని, ఆయన వారసత్వాన్ని కొనసాగించాల్సిన బాధ్యత అందరిపై ఉందని సిపిఎం, ప్రజాసంఘాల నేతలు పిలుపునిచ్చారు. మెట్టమొదటి పార్లమెంట్ ప్రతిపక్ష నేత, దక్షణ భారత కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత పుచ్చలపల్లి సుందరయ్య 39వ వర్ధంతి కార్యక్రమాలను సిపిఎం ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా ఆదివారం నాడు నిర్వహించారు. సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాలులు అర్పించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమాల్లో సుందరయ్య ప్రజా పోరాటాలను నాయకులు వివరించారు. చిన్న వయస్సులోనే బ్రిటీష్‌వారిని వ్యతిరేకించి, ఆంధ్రరాష్ట్రంలో ఉప్పు సత్యగ్రహానికి నాయత్వం వహించిన నేత సుందరయ్య అన్నారు. వ్యక్తిగత ఆస్తిని ప్రజలకు పంచి పెట్టిన త్యాగమూర్తి అన్నారు. సాధారణ వ్యక్తిగా పార్లమెంట్‌కు సైకిల్‌పై వెళ్లిన ఆదర్శనేత పుచ్చలపల్లి సుందరయ్య అని కొనియాడారు. ఆయన పోరాటాలను స్ఫూర్తిగా తీసుకుని సోషలిజం సాధించే కృషిలో సిపిఎం నాయకులు, కార్యకర్తలు పట్టుదలగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.

వార్త 6లో

సబ్ జైలు నిర్వహణ ఇలానా..?

- పనితీరు మార్చుకోకపోతే చర్యలు తప్పవు
- జిల్లా న్యాయమూర్తి శ్రీనివాస్ ఆగ్రహం
- హెడ్ వార్డర్‌పై చర్యలకు సిఫార్సు

హిందూపురం సబ్‌జైలును తనిఖీ చేస్తున్న జిల్లా జడ్జి శ్రీనివాస్

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం సబ్ జైలు నిర్వహణ తీరుపై జిల్లా న్యాయమూర్తి శ్రీనివాస్ తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఖైదీలకు ఇవ్వాల్సిన గుర్తింపు కార్డులు, దస్త్రాల నిర్వహణలో తీవ్ర నిర్లక్ష్యంపై జైలు సూపరింటెండెంట్ అంజి నాయక్‌పై అసహనం వ్యక్తం చేశారు. ఆదివారం జిల్లా జడ్జితో పాటు స్థానిక అదనపు జిల్లా జడ్జి కంపల్లె శైలజ సబ్ జైలును తనిఖీ చేశారు. తొలుత సబ్ జైలులో ఉన్న ఖైదీల వివరాలను జిల్లా న్యాయమూర్తి శ్రీనివాస్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఖైదీలకు ఇవ్వాల్సిన గుర్తింపు కార్డు విషయంలో నిర్లక్ష్యంపై సంబంధిత హెడ్ వార్డర్ రామాంజినాయక్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం జైలు గదులను, మరుగుదొడ్లను జిల్లా న్యాయమూర్తి పరిశీలించారు. ఖైదీలకు ఆహార పదార్థాలు వండేందుకు సరఫరా చేస్తున్న నిత్యావసరాలు, బియ్యం నాణ్యతను పరిశీలించారు. మంచినీటి సదుపాయంపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. జైలు గదుల్లో లైటింగ్, ఫ్యాన్ సదుపాయాలు ఉన్నాయా.. లేదా.. అన్న విషయాలను పరిశీలించారు. అనంతరం ఖైదీలు ఒక్కొక్కరితో ఏ కేసుల్లో నిందితులుగా ఉన్నారు... ఎప్పటి నుంచి జైలులో ఉంటున్నారు... న్యాయవాది ఉన్నారా.. లేదా..? అన్న విషయాలను అడిగి తెలుసుకున్నారు. స్థానిక సబ్ జైల్లో పనిచేస్తున్న మరో హెడ్ వార్డర్ హరినాథ్ విధులకు మద్యం సేవించి వచ్చినా ఆయనపై ఎందుకు చర్యలు తీసుకోలేదని సూపరింటెండెంట్ అంజి నాయక్‌ను ప్రశ్నించారు. చర్యలు తీసుకున్నట్లు ఎలాంటి ఆధారాలు ఉన్నాయని జిల్లా న్యాయమూర్తి అడిగిన ప్రశ్నకు సరైన సమాధానం ఇవ్వక పోవడంపై అసహనం వ్యక్తం చేశారు. దస్త్రాల నిర్వహణలో ఎందుకు ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, క్రమశిక్షణ వత్తి పట్ల అంకితభావం లేకపోవడం వల్లే ఇలా వ్యవహరిస్తున్నారని తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఒక దశలో సస్పెన్షన్‌కు సిఫార్సు చేస్తానని హెచ్చరించారు. దీనికి తోడు ఉద్యోగుల హాజరు పుస్తకంలో కూడా సక్రమంగా సంతకాలు లేకపోవడం పట్ల జిల్లా న్యాయమూర్తి అసహనం వ్యక్తం చేశారు. బాధ్యతాయుతంగా పనిచేయాల్సిన ఉద్యోగి ఇలా నిర్లక్ష్యంగా వ్యవహరించడం ఏమిటని ప్రశ్నించారు. పనితీరు మార్చుకోకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. మరోసారి తాను ఈ జైలును ఆకస్మికంగా తనిఖీ చేస్తానని, ఏమైనా పొరపాట్లు జరిగితే చర్యలు తప్పవని తీవ్రస్థాయిలో హెచ్చరించారు. మద్యం సేవించి విధులకు హాజరవుతున్న హెడ్ వార్డర్ హరినాథ్‌పై చర్యలకు సిఫార్సు చేయనున్నట్లు జిల్లా న్యాయమూర్తి తెలిపారు. సంబంధించిన పూర్తి వివరాలను సోమవారం సాయంత్రం అనంతపురం తీసుకురావాలని జిల్లా అధికారికి ఫోన్ ద్వారా ఆదేశాలు జారీ చేశారు. అనంతరం జిల్లా న్యాయమూర్తి శ్రీనివాస్ మాట్లాడుతూ జైలులో ఏమైనా సమస్యలు ఉంటే తమ దష్టికి తీసుకురావాలని సూచించారు. న్యాయవాదులను ఏర్పాటు చేసుకోలేని నిందితులు ఎవరైనా ఉంటే వివరాలు తెలియజేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ కోర్టుల సూపరింటెండెంట్‌లు భాస్కర్, రాధాకష్ణ, రామాంజనేయులు, లోక్ అదాలత్ హేమావతి పాల్గొన్నారు.

పెనుకొండ సబ్‌జైలు తనిఖీ

పెనుకొండ : అనంతపురం డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ ఛైర్మన్, ప్రిన్సిపాల్ డిస్ట్రిక్ట్ జడ్జి జి.శ్రీనివాస్ పెనుకొండ సబ్ జైలును ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సబ్ జైలులోని ఖైదీల గదులు, మరుగుదొడ్లు, వంటగది, స్టోర్ రూమ్‌లను పరిశీలించారు. జైలు రికార్డులను తనిఖీ చేశారు. ఖైదీలతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎం.బుజ్జప్ప, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి ముజీబ్ పసపల సయ్యద్, సబ్ జైల్ సూపరింటెండెంట్ ఎస్.అజ్గర్ హుస్సేన్, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

నిరుపయోగంగా ఉన్న షాదీ మహల్

నిరుపయోగంగా షాదీమహల్ !

వినియోగంలోకి రావాలంటే మరో రూ. 20 లక్షలు అవసరం

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

మున్సిపాలిటీ పరిధిలో ముస్లిం మైనార్టీల కోసం ఐదేళ్ల క్రితం నిర్మించిన షాదీ మహల్ భవనం నిరుపయోగంగా మారింది. 'అబ్దుల్ కలాం షాదీ మహల్' పేరుతో బోర్డు కూడా తగిలించారు. ఆరేళ్ల క్రితం టిడిపి అధికారంలో ఉన్నప్పుడు అప్పటి మంత్రి పల్లె రఘునాథరెడ్డి ఆధ్వర్యంలో అప్పటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు మైనార్టీ నాయకులు వినతి పత్రం ద్వారా షాదీ మహల్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరారు. స్పందించిన చంద్రబాబు రూ. కోటి మంజూరు చేశారు. ఆ నిధులతో భవన నిర్మాణ పనులు దాదాపు పూర్తి చేశారు. ఇక కాంపౌండ్ వాల్ నిర్మాణంతో పాటు అండర్ డ్రైనేజీ, బాత్ రూములు, టాయిలెట్ గదులు, విద్యుత్ సౌకర్యం కల్పించాల్సి ఉంది. ఇవి పూర్తి చేయడానికి మరో రూ. 20 లక్షలు అవసరం కాగా స్థానిక మైనార్టీ నాయకులు అప్పటి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. ఆ తర్వాత ఎన్నికలు రావడంతో వైసిపి అధికారం చేపట్టింది. దీంతో మైనార్టీ నాయకులు మిగిలిన పనులు పూర్తి చేయడానికి నిధులు మంజూరు చేయాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డికి విన్నవించారు. అయితే ఐదేళ్లయినా నిధులు మంజూరు కాకపోవడంతో ఆ భవన సముదాయాలు నిరుపయోగంగా పడి ఉన్నాయి. ముస్లింల వివాహ వేడుకలు, శుభకార్యాలు, ఇతర సభలు, సమావేశాలు నిర్వహించుకోవడానికి నిర్మించిన భవనాలు వినియోగంలోకి తీసుకురావాలని మైనార్టీ నాయకులు కోరుతున్నారు.

ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి

కోటి రూపాయలతో నిర్మించిన షాదీ మహల్ భవనాలు వినియోగంలోకి తీసుకురాకపోవడం విచారకరం. మరో రూ. 20 లక్షలు మంజూరు చేస్తే పనులు పూర్తవుతాయి. నూతన ప్రభుత్వమైనా షాదీమహల్‌ను వినియోగంలోకి తీసుకురావాలి.

ఎస్. మహమ్మద్ రఫీ, రాష్ట్ర మైనార్టీ నాయకులు.

ప్రజాసేవకుడు సుందరయ్య

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

నిరాడంబరుడు, ప్రజాసేవకుడు కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య అని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.ఇంతియాజ్, కార్యదర్శి వర్గ సభ్యులు ఈఎస్ వెంకటేష్ పేర్కొన్నారు. సుందరయ్య వర్ధంతి సందర్భంగా ఆదివారం సిపిఎం ఆధ్వర్యంలో స్థానిక పార్టీ కార్యాలయంలో సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ పుచ్చలపల్లి సుందరయ్య నిజాయతీకి మారుపేరుగా ఉదహరించే మహానాయకుల్లో ఒకరన్నారు. ఈయన 1913లో నెల్లూరు జిల్లా అలగానిపాడులో జన్మించారన్నారు. స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొని జైలుకెళ్లారని, కమ్యూనిస్టు పార్టీలో చేరి నిజాం పాలనకు వ్యతిరేకంగా పోరాడారన్నారు. ప్రజా సేవకు నిబద్ధుడై పిల్లల్ని సైతం కనలేదన్నారు. చట్టసభలకు సైకిల్‌పై వెళ్లిన నిరాడంబరుడన్నారు. నిస్వార్థంగా ప్రజాసేవ చేసి చరిత్ర పుటల్లో నిలిచిన ఈ ఎర్రసూరీడు 1985 మే 19వ తేదీ అస్తమించారన్నారు. ఆయన ఆశయాల కోసం నిరంతరం కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి పైపల్లి గంగాధర, బ్యాళ్ల అంజి, ఎస్ఎఫ్ఐ నాయకులు పవన్, ముత్యాలు, శ్రావణి, గంగుల సిద్ధూ పాల్గొన్నారు.

పుచ్చలపల్లి సుందరయ్య ఆశయాలను కొనసాగిద్దాం

ధర్మవరం టౌన్ : పుచ్చలపల్లి సుందరయ్య ఆశయాలను కొనసాగిద్దామని జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఆదిశేషు, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జంగాలపల్లి పెద్దన్న పిలుపునిచ్చారు. పట్టణంలోని సాయికృప జూనియర్ కళాశాలలో సిపిఎం సీనియర్ నాయకుడు ఎన్‌హెచ్ బాషా అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ముందుగా కళాశాల ఆవరణలో సుందరయ్య చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ సుందరయ్య కమ్యూనిస్టు పార్టీ స్థాపించినప్పటి నుంచి పేదల కోసం ఎన్నో ఉద్యమాలు చేపట్టారన్నారు. లోక్‌సభలో మొట్టమొదటి ప్రతిపక్షనేతగా ప్రజల సమస్యలు తెలుసుకుని పరిష్కారానికి ఎంతో కృషి చేశారన్నారు. బడుగు బలహీన వర్గాల కోసం అహర్నిశలు పాటుపడ్డారన్నారు. సంపన్న కుటుంబంలో జన్మించినా పేదల అభ్యున్నతి కోసం తన ఆస్తిని పంచిపెట్టారన్నారు. కార్యక్రమంలో సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి ముసుగు మధు, పట్టణ కార్య దర్శి రమణ, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నాగార్జున, అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శు లు సరస్వతి, చంద్రకళ, నాయకులు పోతక్క, ఫాతిమా, మున్సిపాలిటీ పారిశుధ్య కార్మిక సంఘం నాయకులు బాబు, ముకుంద, చెన్నకేశవులు, ప్రసాద్, సూరి, వెంకటేశం పాల్గొన్నారు.

బాల్యం నుంచే ఉద్యమాలకు నాయకత్వం

కదిరి టౌన్ : కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య తన బాల్యం నుంచే తన ఇంటి నుంచే కుల వివక్షకు వ్యతిరేకంగా ఉద్యమాలకు నాయకత్వం వహించారని ప్రజా సంఘాలు, సిపిఎం నాయకులు పేర్కొన్నారు. పట్టణంలోని సిపిఎం కార్యాలయంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బడా సుబ్బిరెడ్డి, పట్టణ కార్యదర్శి జిఎల్.నరసింహులు ఆధ్వర్యంలో సుందరయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యాలయం ముందు అరుణ పతాకాన్ని ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ భూస్వామ్య కుటుంబంలో జన్మించిన సుందరయ్య తన బాల్యం నుంచే స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొని జైలుకెళ్లాడన్నారు. కుల వివక్ష, అంటరానితనానికి వ్యతిరేకంగా తన సొంత ఇంటి నుంచే పోరాటాన్ని ప్రారంభించారని గుర్తుచేశారు. దక్షిణ భారతదేశంలో కమ్యూనిస్టు పార్టీ నిర్మాణం కోసం విశేష కృషి చేశారన్నారు. 17 ఏళ్ల ప్రజాప్రతినిధిగా పనిచేసిన సుందరయ్య నిరంతరం ప్రజల బాగోగుల కోసం చట్టసభల్లో సైతం పోరాడారని తెలిపారు. తుది శ్వాస విడిచే వరకూ సమ సమాజ స్థాపన కోసం, తను నమ్మిన సిద్ధాంతాలకు కట్టుబడి నిరంతరం ప్రజల కోసం పని చేసిన మహనీయులన్నారు. సుందరయ్య ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ పూనుకోవాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు జగన్మోహన్, బాబ్‌జాన్, రామ్మోహన్, శాంతిబాయ్, ఫాజిల్, లక్ష్మీబాయి, ఆంజనేయులు, తిరుపాల్, తాజుద్దీన్, పాల్గొన్నారు.

భారత తొలి ప్రతిపక్ష నేత

ఓబుళదేవరచెరువు : ఓబుళదేవరచెరువులో స్థానిక సిపిఎం నాయకులు పుచ్చలపల్లి సుందరయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. వారు మాట్లాడుతూ సుందరరామ్‌రెడ్డి అయిన తన పేరును సుందరయ్యగా మార్చుకుని పేదలందరికీ అయ్యగా అన్నం పెట్టే మార్గాన్ని ఎంచుకున్న మహానేత పుచ్చలపల్లి అన్నారు. తనకున్న వందల ఎకరాల సాగు భూమిని కడుపేదలకు పంచి, నిరుపేదగా జీవించిన పేదల ప్రేమమూర్తి అన్నారు. సైకిల్‌పై పార్లమెంట్‌కు వెళ్లి నిరాడంబరతను చాటిన నిజాయితీపరుడన్నారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట రథసారధి అన్నారు. కార్యక్రమంలో నాయకులు వివి.రమణ, శ్రీరాములు, కుళ్లాయప్ప, పాల్గొన్నారు.

పేదల పక్షపాతి 'పుచ్చలపల్లి'

హిందూపురం : పేదల పక్షపాతి పుచ్చలపల్లి సుందరయ్య అని సిఐటియు జిల్లా అధ్యక్షులు జెడ్‌పి.శ్రీనివాసులు పేర్కొన్నారు. పట్టణంలోని సిఐటియు కార్యాలయంలో సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ పేదలు, కష్టజీవులు పక్షాన పుచ్చలపల్లి సుందరయ్య పని చేశారన్నారు. కుల వివక్షకు వ్యతిరేకంగా, వ్యవసాయ కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వాలని కష్ట జీవుల పక్షాన నిలబడి పోరాటం చేశారన్నారు. తెలుగు ప్రజలకు ఒక రాష్ట్రం కావాలని కోరుతూ భాషా సంయుక్త రాష్ట్రాలు ఏర్పాటు చేయాలని పోరాటం చేసిన మహోన్నత వ్యక్తి అన్నారు. అయితే నేడు రాష్ట్రంలోని టిడిపి, వైసిపి పార్టీలు ఢిల్లీలో తెలుగు ప్రజల హక్కులపై ప్రశ్నించకుండా మోడీ వద్ద తెలుగు ప్రజల ఆత్మాభిమానాన్ని తాకట్టు పెట్టారని విమర్శించారు. సుందరయ్యే ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.పెద్దన్న, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి రమణ, సిఐటియు జిల్లా కోశాధికారి సాంబశివ, మున్సిపాలిటీ సంఘం పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు జగదీష్, మల్లి, ఆనంద్, మహిళా సంఘం నాయకురాలు జ్యోతమ్మ, ఫ్రీకాట్ యూనియన్ నాయకులు సదాశివరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సుందరయ్య స్ఫూర్తితో ఇళ్ల స్థలాలు సాధించుకుందాం : కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి రమణ

పట్టణంలో సొంతిల్లు లేని నిరుపేదల కోసం భూ పోరాటం ద్వారా స్వాధీనం చేసుకున్న స్థలంలో సుందరయ్య స్ఫూర్తితో ఇంటి పట్టాల కోసం కృషి చేస్తామని కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి రమణ తెలిపారు. పట్టణ సమీపంలో భూ పోరాటం ద్వారా ఏర్పాటు చేసిన సిపిఎం కాలనీలో కెవిపిఎస్ ఆధ్వర్యంలో పుచ్చలపల్లి సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రమణ మాట్లాడుతూ పుచ్చలపల్లి సుందరయ్య భూస్వామ్య కుటుంబంలో జన్మించినా పేదలు, దళితుల సమస్యల పరిష్కారం కోసం జీవితాన్ని అంకితం చేశారన్నారు. కుల వివక్షను రూపుమాపడానికి తన సొంత ఇంటి నుంచే పోరాటాన్ని ప్రారంభించారన్నారు. రాష్ట్రంలో, దేశంలో కుల వివక్ష పోవాలని, భూమిలేని పేదలకు తన సొంత భూమిని పంచి కార్మికులు, కర్షకుల కోసం అనునిత్యం శ్రమించారన్నారు. ఆయన స్ఫూర్తితోనే పేదల సొంతింటి కల నెరవేర్చాలని భూ పోరాటం చేశామన్నారు. ప్రభుత్వం స్పందించి ఈ భూమిలో పేదలందరికీ ఇంటి పట్టాలు ఇచ్చేవంత వరకూ ఉద్యమాలు చేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు రాజప్ప, మల్లయ్య, రామంజప్ప, సరస్వతమ్మ, అర్షియా, నీలమ్మ, నాజియా, సమీర, లక్ష్మీదేవి పాల్గొన్నారు.

కమ్యూనిస్టు గాంధీ సుందరయ్య

సోమందేపల్లి : కమ్యూనిస్టు గాంధీగా పేరొందిన ప్రజానాయకుడు పుచ్చలపల్లి సుందరయ్య అని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కామ్రేడ్ పెద్దన్న కొనియాడారు. స్థానిక సిపిఎం కార్యాలయంలో మండల కమిటీ ఆధ్వర్యంలో సభ్యులు కామ్రేడ్, మాజీ వార్డ్ మెంబర్ వెంకటేష్ అధ్యక్షతన సుందరయ్య చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ముఖ్యఅతిథి కామ్రేడ్ పెద్దన్న మాట్లాడు తూ ఆదర్శప్రాయుడు, నిరాడంబరుడు, నిస్వార్థ ప్రజా సేవకుడు కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య అని కొనియాడారు. భూస్వామ్య, ధనిక వర్గ కుటుంబంలో పుట్టి పీడిత ప్రజల కోసం పాటుపడిన మహోన్నత వ్యక్తి అన్నారు. అంటరాని తనం, కూలీ పోరాటాలు, వర్గ పోరాటాలు నిర్వహించిన గొప్ప ఆదర్శప్రాయుడన్నారు. సుందరయ్యకు నివాళులు అర్పించడం అంటే సిపిఎం ప్రజా పునాది పెంచి కార్యకర్తలను తయారు చేయడమే అని కార్యకర్తలకు సూచించారు. కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు హనుమయ్య, సిపిఎం సభ్యులు గంగరాజు, మాబు, శ్రీకాంత్, మగ్గం రామాంజనేయులు, నాగభూష ణం, కల్లు రామకృష్ణ, బెస్త కిష్టప్ప, కుమ్మర కిష్టప్ప, గోవిందప్ప, శీల నారాయణస్వామి, రాజ్‌గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

సోమందేపల్లి : పెనుకొండ పట్టణంలోని సిఐటియు కార్యాలయంలో పుచ్చలపల్లి సుందరయ్య చిత్రపటానికి సిపిఎం ఆధ్వర్యంలో పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి రమేష్, కమిటీ సభ్యులు తిప్పన్న, బాబావలి, గంగాధర్, మాబాషా పాల్గొన్నారు.

ముదిగుబ్బ : స్థానిక సిపిఎం, సిఐటియు నాయకుల ఆధ్వర్యంలో పుచ్చలపల్లి సుందరయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నాయకులు మాట్లాడుతూ సుందరయ్య 15 ఏళ్లు ఎమ్మెల్యేగా, ఐదేళ్లు ఎంపీగా ప్రజలకు సేవలందించారన్నారు. ఆయన ప్రజా సమస్యల ఫైళ్లు కట్టుకొని సైకిల్‌పై పార్లమెంటుకు చేరుకొని ప్రధానమంత్రి దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేశారన్నారు. అవినీతి రహిత మానవతావాదిగా ప్రజల కోసం నిరంతరం శ్రమించిన వ్యక్తిగా ఆయన చేసిన అభివృద్ధి పనులను స్మరించుకున్నారు. కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి ఆటో పెద్దన్న, సిపిఎం మండల నాయకులు బండల వెంకటేష్, బాబు పాల్గొన్నారు.

వర్ధంతి సభలో పుచ్చలపల్లికి సిపిఎం, ప్రజా సంఘాల నాయకుల ఘన నివాళి

హిందూపురం : పుచ్చలపల్లి సుందరయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న సిపిఎం, సిఐటియు నాయకులు

పెనుకొండ : సుందరయ్యకు జోహార్లు అర్పిస్తున్న సిపిఎం, సిఐటియు నాయకులు

ధర్మవరం, హిందూపురం, కదిరి, ముదిగుబ్బలో పుచ్చలపల్లి సుందరయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న సిపిఎం, సిఐటియు , కెవిపిఎస్, ప్రజాసంఘాల నాయకులు

నేరాలు ఘోరాలు

వాలంటీర్ అనుమానాస్పద మృతి

ప్రజాశక్తి-గోరంట్ల

మృతిచెందిన అనిల్‌కుమార్ యాదవ్

మండలంలోని కొత్త బయనపల్లి వద్ద మల్లాపల్లి గ్రామానికి చెందిన అనిల్‌కుమార్ యాదవ్(25) ఆదివారం అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. పోలీసుల తెలిపిన వివరాలు. మల్లాపల్లి గ్రామానికి చెందిన అనిల్‌కుమార్ యాదవ్ వాలంటీర్‌గా పని చేస్తున్నాడు. అతడు స్నేహితుడు మూర్తితో కలిసి కర్నాటకలోని పెసలపర్తి గ్రామానికి వెళ్లి మద్యం తాగి తిరిగి ద్విచక్ర వాహనంపై స్వగ్రామం బయల్దేరారు. వారు కొత్త బయనపల్లి వద్ద వస్తుండగా కారులో నలుగురు వచ్చి అనిల్ కుమార్ యాదవ్‌తో గొడవ పడ్డారు. ఈ గొడవలో అనిల్‌కుమార్‌యాదవ్ స్పృహ తప్పి కుప్ప కూలి పడిపోయాడు. దీంతో కారులో వచ్చిన వారు పరారయ్యారు. విషయం తెలిసిన వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. అలాగే కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. అనిల్‌కుమార్‌యాదవ్‌పై దాడి చేసిన వారి కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

ఐచర్, బైక్ ఢీ.. ముగ్గురికి గాయాలు

ప్రజాశక్తి-ముదిగుబ్బ

ప్రమాదంలో గాయపడిన వారు

అనంతపురం-కదిరి జాతీయ రహదారిపై ముదిగుబ్బ పట్టణ సమీపంలో ఐచర్ వాహనాన్ని బైక్ ఢీ కొన్న సంఘటనలో ముగ్గురు గాయపడ్డారు. వివరాలు.. ధర్మవరం పట్టణానికి చెందిన సుధాకర్ భార్య వెన్నెల, కుమారుడు చరణ్‌తేజతో కలిసి ద్విచక్ర వాహనంపై మండలంలోని రెడ్డిపల్లిలో ఉన్న దేవస్థానానికి వెళ్లారు. దేవుని దర్శనం అనంతరం బైక్‌పై స్వగ్రామం బయల్దేరారు. అయితే ఆర్‌డిటి కార్యాలయం సమీపంలో స్పీడ్ బ్రేకర్ వద్ద ముందు వెళ్తున్న ఐచర్ వాహనాన్ని గమనించకుండా వేగంగా వెళ్లి వెనుక నుంచి ఢీకొన్నారు. ఈ సంఘటనలో సుధాకర్, వెన్నెలకు స్వల్ప గాయాలు కాగా ఆరేళ్ల బాలుడు చరణ్ తేజ తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు ఇచ్చిన సమాచారంతో ముదిగుబ్బ 108 సిబ్బంది హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని గాయపడిన వారిని బత్తలపల్లి ఆర్‌డిటి ఆసుపత్రికి తరలించారు.

ద్విచక్రవాహనాలు ఢీ

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

తీవ్రంగా గాయపడిన వెంకటరామిరెడ్డి

స్థానిక టూటౌన్ పోలీస్ స్టేషన్ సమీపంలో ద్విచక్ర వాహనం ఢీకొన్న ప్రమాదంలో ఒకరు తీవ్రంగా గాయపడ్డాడు. టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాలు.. మండలంలోని పోతుల నాగేపల్లి గ్రామానికి చెందిన వెంకట రామిరెడ్డి ద్విచక్ర వాహనంపై టూ టౌన్ పోలీస్ స్టేషన్ సమీపంలోని ఓ దుకాణం వద్దకు వచ్చారు. అక్కడ పని ముగించుకుని తిరిగి పట్టణంలోకి వెళ్తుండగా పోతుకుంట వైపు నుంచి వస్తున్న మరో ద్విచక్రవాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో వెంకట్రామిరెడ్డికి తీవ్ర గాయాలు కాగా స్థానికులు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

ప్రయివేటు విద్యాసంస్థల్లో ముందస్తు అడ్మిషన్లు

పట్టించుకోని విద్యాశాఖ అధికారులు

ఎన్ఎస్‌యుఐ జిల్లా ఉపాధ్యక్షులు సురేష్

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

పట్టణంలో ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా పలు ప్రయివేటు, కార్పొరేట్ విద్యాసంస్థలో ముందస్తు అడ్మిషన్లు, ప్రచారాలు నిర్వహిస్తున్నా విద్యా శాఖ అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదని ఎన్ఎస్‌యుఐ జిల్లా ఉపాధ్యక్షులు రావులచెరువు సురేశ్ పేర్కొన్నారు. పట్టణంలోని ఎన్జీఓ హోం ఆవరణలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. విద్యాసంవత్సరం ప్రారంభం కాకమునుపే పలు ప్రయివేటు, కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఇష్టానుసారంగా ఫీజుల వసూళ్లు చేయడమే కాకుండా ముందస్తు అడ్మిషన్లు చేస్తున్నారన్నారు. ఇదంతా తెలిసినా విద్యాశాఖ అధికారులు ఏమీ పట్టనట్లు వ్యవహరించడంలో ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. అధికారులు తక్షణం పట్టణంలో ఏర్పాటు చేసిన విద్యాసంస్థల హోర్డింగులను తొలగించడంతో పాటు ముందస్తు ప్రచారం, అడ్మిషన్లను అరికట్టాలన్నారు. అలాగే పాఠశాలలను పర్యవేక్షణ చేసి శాఖా పరమైన చర్యలు తీసుకోవాలని, లేనిచో ఎన్ఎస్‌యుఐ ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఆయనతో పాటు పట్టణ అధ్యక్షుడు బండారు చైతన్య, నాయకులు చందు, నరేష్ ఉన్నారు.

విలేకరులతో మాట్లాడుతున్న ఎన్ఎస్‌యుఐ జిల్లా ఉపాధ్యక్షులు సురేష్ నాయకులు

పత్యాపురంలో వేరుశనగ విత్తనాలు సిద్ధం చేస్తున్న మహిళలు

ఖరీఫ్ సాగుకు సిద్ధమవుతున్న రైతులు

ప్రజాశక్తి-బత్తలపల్లి

ఖరీఫ్ సీజన్‌లో వేరుశనగ పంట సాగు చేసేందుకు రైతులు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే పొలం పనుల్లో నిమగ్నమయ్యారు. మండలంలో ఇప్పటి వరకూ అరకొరగా మూడు దఫాలుగా వర్షం కురవడంతో దుక్కులు చేసేందుకు రైతులు సన్నద్ధమవుతున్నారు. విత్తనం వేసే సమయం ముంచుకొస్తున్నందున రైతులు పొలాల్లోని కంది కొయ్యలు ఏరివేశారు. పొలాలకు సేంద్రియ ఎరువులు తోలుతూ సాగుకు సిద్ధమవుతున్నారు. గ్రామాల్లోని మహిళలు వేరుశనగ విత్తనాలను సిద్ధం చేసే పనిలో ఉన్నారు.

24 మండలాల్లో 450.2 మి.మీ వర్షపాతం

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

జిల్లాలోని 32 మండలాలకు గానూ 8 మండలాలు మినహా మిగిలిన 24 మండలాల్లో 450.2 మి.మీ వర్షపాతం నమోదైంది. జిల్లా వ్యాప్తంగా శనివారం రాత్రి కురిసిన వర్షంతో రైతులు ఖరీఫ్ సీజన్‌కు పొలాలు దుక్కి దున్ని చదును చేయడానికి వీలు కలిగింది. సాధారణంగా జూన్, జులై నెలల్లో ఖరీఫ్ పంటలు సాగు చేస్తే మంచి ఫలితాలు ఉంటాయని, ఈ ఏడాది సకాలంలో వర్షాలు కురవడం శుభ పరిణామమని రైతులు పేర్కొంటున్నారు. శనివారం రాత్రి కురిసిన వర్షాలకు దుక్కి దున్నడానికి అనుకూలం అన్నారు. రామగిరిలో అత్యధికంగా 64.2 మి.మీ, అమరాపురం-39.8, బుక్కపట్నం-38.4, లేపాక్షి-32.8, నల్లచెరువు-28.4, బత్తలపల్లి-27.8, సోమందేపల్లి-24.4, గాండ్లపెంట- 22.6, పుట్టపర్తి-20.6, కదిరి-16.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. పరిగి, పెనుకొండ, చిలమత్తూరు, రొద్దం, తదితర మండలాల్లో ఓ మోస్తరు వర్షం కురిసింది. తాడిమర్రి మండలంలో అతి తక్కువగా 2.2 మిల్లీమీటర్ల వర్షం కురిసింది.

నల్లచెరువులో 28.4 మి.మీ.

నల్లచెరువు : మండల వ్యాప్తంగా శనివారం సాయంత్రం వర్షం కురవడంతో 28.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైందని రెవెన్యూ అధికారులు తెలిపారు. ఈ వర్షం రైతులకు ఎంతో ఉపయోగకరమని తెలిపారు. వర్షం కారణంగా నల్లచెరువు మేజర్ పంచాయతీలోని చాలా వీధుల్లో పెద్దఎత్తున పొంగి పొర్లడంతో రాకపోకలకు స్థానికులు ఇబ్బంది పడ్డారు. ఒకవైపు పంటలకు అనువైన సమయంలో వర్షం కురవడం, మరోవైపు వ్యవసాయ అధికారులు ఈ నెల 24వ తేదీ నుంచి విత్తన వేరుశెనగ పంపిణీకి శ్రీకారం చుట్టడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ వర్షం వేసవి దుక్కులు చేసుకోవడానికి అనుకూలంగా ఉంటుందని రైతులు పేర్కొంటున్నారు. ఏదేమైనా ఈ ఏడాది విత్తన వేరుశనగ ముందుగానే పంపిణీ చేస్తే బాగుంటుందని రైతులు కోరుతున్నారు.

ఖరీఫ్‌కు సన్నద్ధమవ్వండి: ఏవో

ప్రజాశక్తి-బత్తలపల్లి

ఏఓ ఓబిరెడ్డి

ప్రస్తుతం కురుస్తున్న వర్షాల నేపథ్యంలో రానున్న ఖరీఫ్‌కు ఇప్పటి నుంచే సన్నద్ధం కావాలని బత్తలపల్లి వ్యవసాయ అధికారి ఓబిరెడ్డి రైతులకు సూచించారు. ఈ మేరకు ఆయన విత్తనాల సేకరణ, వేసవి దుక్కులు, భూసార పరీక్షలు, తదితర అంశాలపై రైతులకు పలు సలహాలు, సూచనలు చేశారు. రైతులు కార్యాచరణతో సాగులోకి దిగితే మేలైన దిగుబడులు సాధించవచ్చని తెలి పారు. నూతన వంగడాలపై అధికారుల సూచనలు తీసుకోవాలని సూచించారు.

వేసవి దుక్కులు..

ప్రస్తుత వేసవిలో దుక్కులు చేపట్టడం వల్ల చాలా ఉపయోగాలున్నాయి. వర్షం నీరు భూమిలోకి ఇంకి పొలం ఖరీఫ్‌కు అనువుగా తయారవుతుంది. భూమిలో కలుపు దుక్కులతో పాటు పైకి రావడం వల్ల ఎరువుగా మారుతుంది. భూమి లోపల చీడపీడలు, ఇతర కీటకాల గుడ్లు, లార్వాలు పైకి చేరతాయి. వీటిని తినేందుకు పక్షులు ఎక్కువగా వస్తాయి. వాటి వ్యర్థాలతో భూమికి సత్తువ చేకూరుతుంది.

భూసార పరీక్షలు..

రైతులు ఈ వేసవిలో భూసార పరీక్షలు చేయించడం వల్ల భూమిలో పోషక విలువలు, సారం గుర్తించే అవకాశం ఉంటుంది. తద్వారా రానున్న ఖరీఫ్ సీజన్‌కు భూమిని తయారు చేసుకునేందుకు వీలు కలుగుతుంది. రైతులు అందుబాటులో ఉన్న నీటి వనరులు సద్వినియోగం చేసుకొని అందుకు తగ్గట్టుగా పంటల ప్రణాళిక తయారు చేసుకోవాలి. తద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చు. పొలంలో సమీపంలో నీటి వృద్ధిలో భాగంగా కాలువల్లో పూడిక తీత, చిన్నపాటి మరమ్మతులు చేపట్టడం వల్ల నీటి నిల్వల సామర్థ్యం పెరిగే అవకాశం ఉంటుంది. ఎప్పటికప్పుడు వ్యవసాయ అధికారుల సూచనలు, పంటల యాజమాన్యంలో సస్యరక్షణ చర్యలు చేపట్టడం వల్ల అధిక దిగుబడి సాధించవచ్చు.

టిప్పర్, బైక్ ఢీ.. యువకుడి మృతి

బీటెక్ విద్యార్థులు చెన్నై నుంచి వస్తుండగా ప్రమాదం

ప్రజాశక్తి-బత్తలపల్లి

అనంతపురం-కదిరి జాతీయ రహదారిపై ఆదివారం మండల పరిధిలోని నల్లబోయనపల్లి బస్టాప్ సమీపంలో టిప్పర్, బైక్ ఢీకొన్న ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందగా, మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. బత్తలపల్లి పోలీసులు తెలిపిన వివరాలు.. చెన్నేకొత్తపల్లి మండలంలోని ప్యాదిండి గ్రామానికి చెందిన జంగాలపల్లి హనుమంతరెడ్డి కుమారుడు జంగాలపల్లి అశోక్‌రెడ్డి(22), బత్తలపల్లి ముండలంలోని అప్పరాచెరువు గ్రామానికి చెందిన బ్యాళ్ల వెంకటశివయ్య కుమారుడు బ్యాళ్ల విష్ణువర్ధన్‌బాబు చెన్నైలోని ఓ ప్రయివేట్ కళాశాలలో బీ.టెక్ చదువుతున్నారు. అశోక్ ఫైనల్ ఇయర్, విష్ణువర్ధన్ తృతీయ సంవత్సరం చదువుతున్నారు. ఇద్దరూ ఒకే ప్రాంతానికి చెందిన వారు కావడంతో అక్కడ స్నేహితులయ్యారు. కళాశాలకు సెలవులు కావడంతో ఇద్దరూ కలిసి బైక్‌పై చెన్నై నుంచి స్వగ్రామాలకు బయల్దేరారు. మార్గమధ్యలో ముదిగుబ్బ మండలంలోని రాళ్ల అనంతపురంలో అశోక్ అక్క ఇంటికెళ్లి మధ్యాహ్నం భోజనం చేసి బయల్దేరారు. నల్లబోయనపల్లి వద్దకు రాగానే గ్రామంలో నుంచి వస్తున్న ఐచర్ వాహనాన్ని తప్పించబోయి అదుపుతప్పి అనంతపురం నుంచి ఉప్పలపాడుకు ఇసుక రీచ్‌కు వెళ్తున్న టిప్పర్‌ను ఎదురుగా ఢీ కొన్నారు. ఈ ప్రమాదంలో అశోక్‌రెడ్డి తలకు తీవ్రగాయమై అక్కడికక్కడే మృతి చెందగా, విష్ణువర్ధన్ తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు విష్ణువర్ధన్‌ను 108 వాహనంలో ఆర్‌డిటి ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న రాళ్ల అనంతపురంలో ఉన్న అశోక్ అక్క సంఘటనా స్థలానికి చేరుకుని తమ్ముని మృతదేహంపై పడి బోరున విలపించారు. విషయం తెలిసిన వెంటనే ఎస్ఐ శ్రీనివాసులు, ఎఎస్ఐ సోమశేఖరమూర్తి పోలీసు సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. అశోక్‌రెడ్డి మృతదేహాన్ని ధర్మవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విష్ణువర్ధన్

సంఘటనా స్థలంలో అశోక్‌రెడ్డి మృతదేహంపై పడి రోదిస్తున్న కుటుంబ సభ్యులు

ప్రమాణాలు పాటించని కాంట్రాక్టర్లు

బత్తలపల్లి నుంచి ముదిగుబ్బ వరకూ జాతీయ రహదారి పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్లు ఏమాత్రం ప్రమాణాలు పాటించడంలేదన్న విదుర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ రహదారి పనులు చేపట్టిన తర్వాత పదుల సంఖ్యలో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నా ఏమాత్రం నివారణ చర్యలు చేపట్టడం లేదన్న విమర్శలు ఉన్నాయి. రామాంజులపల్లి, కట్టకిందపల్లి, ఉప్పరపల్లి క్రాస్, నల్లబోయన పల్లి వద్ద తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. అయినా రోడ్డు పనులు చేస్తున్న సమయంలో ఆయా ప్రాంతాల్లో ఎలాంటి ముందస్తు చర్యలు చేపట్టడం లేదు.

ఇందిరమ్మ కాలనీలో ఉచిత వైద్యశిబిరం

ప్రజాశక్తి-హిందూపురం

కులమతాలకు అతీతంగా హిందూ ముస్లింల ఆధ్వర్యంలో ఆదివారం బెంగళూరుకు చెందిన సప్తగిరి మెడికల్ కాలేజీ రీసెర్చ్ సెంటర్ సూపర్ స్పెషాలిటీ వైద్యశాల వైద్య బృందం సౌజన్యంతో పట్టణంలోని కొట్నూరు ఇందిరమ్మ కాలనీలోని మహమ్మాదీయ మసీదులో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో సాధారణ పరీక్షలతో పాటు ఎకో, ఈసీజీ, గుండె సంబంధిత, బిపి, షుగర్, తదితర రక్త పరీక్షలు ఉచితంగా నిర్వహించారు. 20 మందిని ఇతర పరీక్షల కోసం బెంగళూరులోని సప్తగిరి సూపర్ స్పెషాలిటీ వైద్యశాలకు రెఫర్ చేశారు. వైద్యులు హరిచరణ్, దత్తా, అభిషేక్, రామ్‌దాస్‌తో పాటు వైద్య బందాన్ని ఘనంగా సన్మానించారు. శిబిరంలో అఖిల భారత టిప్పు సుల్తాన్ మానవతా రక్త దాన సంఘం సభ్యులు షేక్ షబ్బీర్, మహమ్మదీయ మసీదు ముతవల్లి షబ్బీర్, అఖిల భారత ఫ్రీడమ్ ఫైటర్ షహీద్ టిప్పు సుల్తాన్ యునైటెడ్ ఫ్రంట్ జాతీయ అధ్యక్షులు ఉమర్ ఫారూక్ ఖాన్, ఇతర ప్రముఖులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

శిబిరంలో వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్లు

విత్తన వేరుశనగకు రిజిస్ట్రేషన్ చేసుకోండి

ఏఓ ఇలియాజ్‌అహ్మద్

ఓబుళదేవరచెరువు : ఖరీఫ్-2024కు సంబంధించి రాయితీ విత్తన వేరుశనగ అవసరమైన మండల పరిధిలోని రైతులు సంబంధిత రైతు భరోసా కేంద్రంలో పేర్లు నమోదు చేసుకోవాలని ఏఓ ఇలియాజ్ అహ్మద్ తెలిపారు. ఏఓ ఆదివారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతులకు మాత్రమే వరుస సంఖ్యలో విత్తన వేరుశనగ పంపిణీ చేస్తామని తెలిపారు. రైతులు పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ కార్డు, మొబైల్ ఫోన్ తీసుకెళ్లి రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు.

తలుపుల : ఈ ఖరీఫ్‌లో వేరుశనగ సాగు చేసే రైతులు రాయితీ విత్తన వేరుశనగ కోసం సంబంధిత గ్రామ రైతు భరోసా కేంద్రంలో పేర్లు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఏఓ షాదాబ్ సూచించారు. ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రైతులు వెంట పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ కార్డు, మొబైల్ ఫోన్ తీసుకెళ్లి పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు.

పెట్రోల్ లూజుగా అమ్మరాదు : సిఐ

ప్రజాశక్తి-పుట్టపర్తి క్రైమ్

ఎన్నికల కోడ్ ముగిసేంత వరకూ పెట్రోల్ బంక్ యజమానులు ఎవరికి పడితే వారికి లూజుగా పెట్రోల్ విక్రయించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పట్టణ సిఐ కొండారెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో హెచ్చరించారు. ఎన్నికల కోడ్ జూన్ 6వ తేదీ వరకూ ఉంటుందన్నారు. అంతవరకూ వాటర్ బాటిల్స్‌లో కానీ, క్యాన్‌లలో కానీ పెట్రోలు, డీజిల్ విక్రయించకూడదన్నారు. ఎన్నికల కోడ్ ముగిసేంత వరకూ లూజు విక్రయించకుండా యజమానులు తమ సిబ్బందిని ఆదేశించాలన్నారు. కొందరు విధ్వంసక చర్యలకు పాల్పడే అవకాశం ఉందని కావున పెట్రోల్ బంకుల యజమానులు పోలీసులకు సహకరించాలని కోరారు. పెట్రోల్, డీజిల్ లూజు అమ్మకాలు జరిగినట్లు తెలిస్తే పెట్రోల్ బంకుల యజమానులపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.